
సాక్షి సిద్దిపేట
శనివారం : 8 : ఏప్రిల్ : 2023




త్వరలో రజకుల బహిరంగ సభ
రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని జాతీయ రజక సంఘాల కోఆర్డినేటర్ మల్లేశ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్ పట్టణంలో మాట్లాడారు. 10లో..



జీవాల కరువు యాత్ర
గొర్రెలు, మేకలు ఆకలి తీర్చడానికి కాపరులు దేశాటన చేస్తున్నారు. ఇంటిని, ఊరికి దూరంగా ఉంటూ కరువు యాత్ర చేస్తున్నారు. 10లో..



ఠాణా.. ప్రారంభమెప్పుడో?
కొమురవెల్లిలో రూ.కోటితో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనం పూర్తయి ఏడాది కావొస్తున్నా ప్రారంభానికి నోచుకోవడంలేదు. 11లో..



పాఠం.. పరిశోధన

- మెడికల్ కళాశాలకు మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్
- మంత్రి హరీశ్ రావు చొరవతో మంజూరు
- వైద్య విద్యార్థులకు ప్రయోజనం



సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల

సాక్షి, సిద్దిపేట/సిద్దిపేట కమాన్: వైద్య విద్యార్థులు పాఠం వినడంతో పాటు ఇకనుంచి పరిశోధనలు చేయనున్నారు. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్ రావు చొరవతో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ మంజూరైంది. ఇప్పటికే సకల హంగులతో తీర్చిదిద్దిన కళాశాలకు రీసెర్చ్ యూనిట్ రాకతో ప్రాధాన్యం పెరగనుంది. అంతేకాకుండా విద్యార్థులకు సరికొత్త పరిశోధనలు చేసేందుకు అవకాశం లభించినుంది. యూనిట్‌లో జరిగే పరిశోధనలతో మున్ముందు కళాశాలకు కూడా మంచి గుర్తింపు రానుంది.

2018లో ప్రారంభం

- సిద్దిపేటలో 2018లో ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైంది. పట్టణంలోని ఎన్సాన్‌పల్లి శివారులో 28 ఎకరాల స్థలంలో శాశ్వత భవన నిర్మించారు.
- ఈ ఏడాది ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ పూర్తవగా, 62 సీట్లతో పీజీ తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.
- వైద్య విద్యార్థులు పాఠాలకే పరిమితం కాకుండా పరిశోధనలపై ఆసక్తి పెంపొందించడం కోసం మంత్రి హరీశ్‌రావు మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్‌ను మంజూరు చేయించారు.
- ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 35 విభాగాలు ఉన్నాయి. వాటిలో పరిశోధన చేయాలంటే ఈ రీసెర్చ్ యూనిట్ ఉపయోగించుకోనున్నారు.
- ఈ యూనిట్‌లో పరిశోధనలకు అవసరమైన అన్ని రకాల అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటాయి.
- మెడికల్ కళాశాలలో పీజీ విద్య అభ్యసించే వారితో పాటు కళాశాలలో బోధించే ప్రొఫెసర్లు సైతం ఏదైనా అంశంపై లోతుగా పరిశోధన చేసేందుకు అవకాశం ఉంది.
- పరిశోధన ఫలితాలు పబ్లికేషన్‌లో ప్రచురితమైతే అటు పరిశోధన విద్యార్థితో పాటు వైద్య కళాశాలకు పేరు వస్తుంది.
- కళాశాలలో పరిశోధన సలహా మండలిని ఏర్పాటు చేసి పరిశోధన ప్రాధాన్యత అంశాలు, ప్రాజెక్టులను గుర్తించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- లోకల్ అడ్వైజరీ కమిటీ సూచించిన వ్యాధులపై కూడా పరిశోధనలు చేస్తారు.

రూ.5కోట్లు మంజూరు

వైద్య కళాశాలలో పరిశోధనలు నిర్వహించేందుకు ఐదేళ్లకుగాను ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయనుంది. భవనాలకు రూ.25 లక్షలు, పరికరాల కొనుగోలు రూ.2 కోట్లను ప్రభుత్వం కేటాయించనుంది. తొలి విడతలో రూ.2.5 కోట్లు విడుదల చేయగా, వీటిని సివిల్ నిర్మాణాలు, పరికరాల కొనుగోలు, జీతాలు, శిక్షణ కార్యక్రమాలకు వినియోగిస్తారు. కాగా వైద్య కళాశాలకు మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ మంజూరు చేయించినందుకు మంత్రి హరీశ్‌రావుకు కళాశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పరిశోధనలతో పేరు తేవాలి



వైద్య విద్యార్థులు పాఠాలకే పరిమితం కాకుండా పరిశోధనలపై దృష్టి సారించాలి. రీసెర్చ్ యూనిట్‌ను సద్వినియోగం చేసుకొని గొప్ప ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. సరికొత్త పరిశోధనలతో భవిష్యత్‌లో కళాశాలకు పేరు తేవాలి.

– మంత్రి హరీశ్ రావు

న్యూస్‌రీల్

మంత్రిహరీశ్‌రావును కలిసిన ఎంపీపీ



మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీపీ మాలోతు లక్ష్మీ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంపీపీ సభ్యురాలు మాలోతు లక్ష్మీభీలునాయక్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, మండల సమస్యలను వివరించారు. కుందనవానిపల్లి మీదుగా చౌటకుంట, సీతారంతండా, గండిపల్లి ఎక్స్ రోడ్డు వరకు, మైసమ్మ వాగుతండా వయా గొల్లపల్లి, చెరువు ముందు తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. హుస్నాబాద్‌లో నిర్మిస్తున్న గిరిజన భవనానికి అదనంగా రూ.2కోట్లు మంజూరుకు చేసిందుకు ధన్యావాదాలు తెలిపామన్నారు.

'దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి'



మాట్లాడుతున్న దేవీ రవీందర్

గజ్వేల్‌రూరల్: బీజేపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యవహరించడం సరికాదన్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దని అన్నారు. చదువులు, ఉద్యోగాలు పక్కనపెట్టి జెండా పట్టుకోవాలని గతంలో విద్యార్థులను రెచ్చగొట్టారని గుర్తుచేశారు. పార్లమెంటు సభ్యుడిగా, జాతీయ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి హోదాకు తగ్గట్టుగా నడుచుకోవాలన్నారు. బీజేపీ అరాచక రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్, స్వామి, నర్సింహులు, సాయిగౌడ్ పాల్గొన్నారు.

భయాన్ని వీడాలి

సిద్దిపేటజోన్: భయం వీడితేనే తమలోని సత్తా ఇతరులకు తెలుస్తుందని, గొప్ప వక్తలుగా ఎదుగుతారని రాష్ట్ర నర్సింగ్ బోర్డ్ సభ్యుడు సాయిరాం అన్నారు. శుక్రవారం ప్రతిభ డిగ్రీ కళాశాలలో లీడ్ ఇండియా ద్వారా ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకూ చెందిన విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ ఇండియా ప్రతినిధి రంజిత్, ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి తరలిరావాలి

దుబ్బాక: టీఎస్‌పీఎస్‌సీ బోర్డు రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 10న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని దుబ్బాక నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు జింక సంజీవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ.. రద్దు చేసిన పరీక్షలను వెంటనే నిర్వహించాలని కోరారు. ఈ కేసును సీబీఐకి అప్పగించి, నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల బీఎస్పీ అధ్యక్షుడు నల్క నర్సింలు, నాయకులు అనాజీపూర్ సంజీవ్, జీడిపల్లి రమేష్, రాజేష్, శంకర్, యాదగిరి, తదితరులున్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

సిద్దిపేటజోన్: హరిత కార్యక్రమంలో పట్టణవాసులు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ కోరారు. శుక్రవారం సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో డివైడర్‌లో మొక్కలకు నీరు పట్టారు. 7 వార్డులో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూజీడీ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, ఖాళీ ప్రదేశంలో చెత్త చెదారం తొలగింపు సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం



ఇఫ్తార్‌లో పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని సంగాపూర్ మదర్సాలో చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ దర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతున్నామన్నారు. కార్యక్రమంలోగజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఖాజా విరాసత్ అలీ, జుబైర్‌పాషా, కౌన్సిలర్‌లు శ్యామల, ఉప్పల మెట్టయ్య, కోఆప్షన్ సభ్యుడు ఉమర్, ఇస్మాయిల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీర, ఏఎంసీ డైరెక్టర్ మతిన్, నాయకులు గుంటుకు రాజు, అహ్మద్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

'రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం రూ.5 వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రెడ్డి ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణరావుపేట రెడ్డి రైతు సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మీయ సమ్మేళనం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేషన్ సాధించే వరకు ఉద్యమం చేస్తామని, ఈ నెల 8న సిద్దిపేటలో భైరి అంజయ్య గార్డెన్‌లో నిర్వహించే రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి రెడ్డి బాంధవులు హాజరై ఐక్యత చాటాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, నాగరాజు రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రావణ్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరసన విజయవంతం చేయాలి

కొండపాక(గజ్వేల్): రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు కోరుతూ ఈ నెల 11న సిద్దిపేటలో నిర్వహించే నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డులో జేఏసీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షుడు మారెడ్డి లింగారెడ్డితో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పన్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గూడ మహేందర్‌రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కెసిరెడ్డి శశికళరెడ్డి పాల్గొన్నారు.

కేసులు, జైళ్లు మాకేం కొత్త కాదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జైలు జీవితం కొత్తేమీ కాదని, రాష్ట్ర ప్రజల కోసం ఎన్నిసార్లు అయినా జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా శుక్రవారం సిద్దిపేటలో బీజేపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రంగధాంపల్లి తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంలో తనను ఇరికించారని, ఇది కావాలని చేసిన కుట్ర అని ప్రజలు గుర్తించారన్నారు. అక్రమ కేసులు, పేపర్ లీకేజీలో ఎలాంటి సంబంధం లేదని ప్రమాణం చేస్తానని, వరంగల్ సీపీ రంగనాథ్, సీఎం కేసీఆర్ కూడా ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందు బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అంబటి బాలేష్‌గౌడ్, చక్రధర్‌గౌడ్, వేణుగోపాల్, శ్రీనివాస్‌యాదవ్, అరుణారెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, విభీషణ్‌రెడ్డి, శివకుమార్, టి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద ...

గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద బండి సంజయ్‌కు స్థానిక బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎల్లు రాంరెడ్డి, పేర్ల శ్రీనివాస్, కుడిక్యాల రాములు, నందన్‌గౌడ్, బండారు మహేష్, సురేష్, మనోహర్‌యాదవ్, ఉప్పల మధుసూదన్, పంజాల అశోక్‌గౌడ్, శ్రీనివాస్, ఏగొండ, గణేష్, విజయ్, నవీన్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య కేంద్రానికి రూ.10కోట్లు

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో వృత్తి నైపుణ్య కేంద్రానికి రూ.10కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం తెలిపారు. న్యాక్ వృత్తి నైపుణ్య శిక్షణ భవనం కేంద్ర రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం అవుతుందన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్–న్యాక్ సెంటర్‌లో లార్సన్ అండ్ టూబ్రో, ఎల్ అండ్ టీ సంస్థల ఆధ్వర్యంలో ఏటా 300 మంది నిర్మాణ రంగ కార్మికులకు శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. శాశ్వత శిక్షణ భవన నిర్మాణంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్మాణ రంగ కార్మికులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

07ఎస్‌డిపి134– మంత్రి హరీశ్‌రావు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



ప్రత్యేక ప్రార్థనలో భక్తులు



దైవసందేశం ఇస్తున్న బిషప్ పద్మారావు

మెదక్‌జోన్: మెదక్ సీఎస్ఐ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రార్థనలు కొనసాగాయి. ఈసందర్భంగా బిషప్ పద్మారావు దైవసందేశం ఇచ్చారు. పాపుల పరిరక్షణ కోసమే లోకరక్షకుడు ఏసయ్య శిలువ వేయబడ్డాడని అన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య, గురువులు సువర్ణ, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

అంబారిపై లక్ష్మీనర్సింహుడు



ట్రాక్టర్‌పై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని అంబారిపై ఊరేగించారు. ఈ ఉత్సవాలకు బెజ్జంకితో పాటు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి శేషం మధుసూదనాచారి, శ్రీవాత్సవ, ఆలయ కమిటీ, ఎండోమెంట్, పోలీస్, వైద్య, పంచాయతీ అధికారులుపాల్గొన్నారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన రథోత్సవ వేడుకలను శనివారం నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు లక్ష్మీనర్సింహ స్వామి రథోత్సవానికి భక్తులు వేలాదిగా తరలిరానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

దరువు ఎల్లన్న పూజలు

జాతీయ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు దరువు ఎల్లన్న బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ రాములు ఆయనను శాలువాతో సన్మానించారు. ఆలయ పూజారి మధుసూదనాచారి, డైరెక్టర్ ఓదేలు, బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్, శ్రీనివాస్, రవి, నారాయణరెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలు వినియోగించుకోవాలి



బద్రాద్రి తలంబ్రాలు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): ఆర్టీసీ సంస్థ అందిస్తున్న కార్గో సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఆ సంస్థ ప్రతినిధులు బాలయ్య, మురళి అన్నారు. పాలమాకులకు చెందిన 146 మంది భక్తులు సిద్దిపేట ఆర్టీసీ కార్గోలో బద్రాద్రి తలంబ్రాలు బుక్ చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామానికి చేరుకున్న స్వామివారి తలంబ్రాలను వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించి భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ బద్రాచలం వెళ్లలేని వారికి ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా తలంబ్రాలు అందజేయడం అభినందనీయమన్నారు.

ధరణిలో 'రాస్తా' ఎక్కడ?

- ఆన్‌లైన్‌లో నమోదు కాని వివరాలు
- రోడ్డు కింద పోయిన భూములకూ పట్టాలు
- ఇదే అదనుగా పట్టాదారుల విక్రయాలు
- నష్టపోతున్న కొనుగోలు, అమ్మకందార్లు



హుస్నాబాద్ - అక్కన్నపేట ఆర్ అండ్ బీ రోడ్డు

హుస్నాబాద్‌రూరల్: భూ రికార్డులను పారదర్శకంగా ఉంచడం కోసం ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ గ్రామీణ ప్రాంత రైతులకు కొత్త సమస్యలు తెచ్చిపెడుతుంది. గతంలో భూ రికార్డులు 1బి, పహాణిలో పట్టాదారు పేర్లతో పాటు అనుభవదారుల పేర్లు కూడా ఉండేవి. సర్వే నంబర్ల క్రమంలో పట్టాదారుల వివరాలను చూపించి సాగు భూమి వివరాలను తెలిపే అవకాశం ఉండేది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి రికార్డుల్లో తప్పిదంతో గతంలో రోడ్డు కోసం భూములు విక్రయించిన వారికి పట్టా అందింది. రోడ్ల కింద పోయిన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ఉండాల్సిన భూమికన్నా ఎక్కువగా చూపి పట్టాదారులు క్రయ విక్రయాలు చేసి కొత్త సమస్యలను సృష్టిస్తున్నారు.

డివిజన్ వ్యాప్తంగా..

- హుస్నాబాద్ శివారులో 292 సర్వే నంబరు దాని సమీప నంబర్లలో మీదుగా గతంలో అధికారులు రహదారి నిర్మాణం చేపట్టారు.
- రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూమి వివరాలను పూర్తిగా ధరణిలో నమోదు చేయలేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- పట్టణ శివారులో వేసిన రోడ్డు కింద సేకరించిన భూమి వివరాలు ధరణి పోర్టల్‌లో నమోదు కాకపోవడంతో ఈ భూములపై పట్టాదారులకు హక్కులు వచ్చాయి.
- దీంతో పట్టాలో అదనంగా ఉన్న భూమిని చూపించి ఎక్కువ ధరకు విక్రయాలు చేస్తున్నారు.
- గతంలో భూములను అమ్మిన యజమానులకు రోడ్డు కింద పోయిన భూములకు సంబంధించి రికార్డుల్లో పేర్లు రావడం కొత్త సమస్యలకు దారి తీస్తోంది.
- పట్టాదారు పాసు పుస్తకంలో భూమి విస్తీర్ణం ఎక్కువ ఉండటంతో భూముల సర్వే చేయించి హద్దులను జరిపి కొత్త సమస్యలను సృష్టిస్తున్నారు.
- హుస్నాబాద్, తోటపల్లి, చౌటపల్లి, అంతకపేట, అక్కన్నపేట వరకు రోడ్డు పక్కన సర్వే నంబర్ల భూములకు సంబంధించి ఇలాంటి క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి.
- హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధి విస్తరిస్తుండడంతో ఈ భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఎకరాకు రూ.2 కోట్ల వరకు ధర పలుకడంతో పట్టాదారులు పాత రికార్డులను తిరిగేస్తున్నారు.
- పాత రికార్డులో సాగుకు పనికి రాని భూములకు అధికారుల నుంచి రికార్డులు పొందుతున్నారు.
- కిషన్‌నగర్ సమీపంలో ఓ రైతుకు 1.20 ఎకరాల భూమి ఉంటే రోడ్డు కింద పోయిన 0.20 గుంటల భూమిని కలుపుకొని రెండెరాల్లో ప్లాట్లు చేసి విక్రయించాడు.
- ప్రభుత్వం కిషన్‌నగర్‌లో నిర్మిస్తున్న ఐఓసీ భవన సముదాయం వద్దకు వెళ్లే రోడ్డును కూడా ఓ వెంచర్‌లోనే కలిపి ప్లాటింగ్ ఏర్పాటు చేశారు.
- భూముల రిజిస్ట్రేషన్ సమయంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా అసిస్టెంట్లు చెప్పిన మాటపై రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.
- రోడ్ల కింద పోయిన భూములను విక్రయిస్తుండడంతో సమీప రైతులు తమ భూములను కాపాడుకోనేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది.
- రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి రోడ్డు కింద పోయిన భూములను గుర్తించి వాటికి ధరణిలో రాస్తాల కింద మార్కింగ్ చేయాలని కోరుతున్నారు.

ఆ భూములను గుర్తించాలి



పాత రికార్డుల్లో రోడ్ల కింద భూములు ఉన్నప్పటికీ ధరణిలో నమోదు కాకపోవడంతో కొందరికి పట్టా పాసు పుస్తకాలు అందాయి. దీంతో ఆ భూ యజమానులు వాటిని విక్రయించి కొత్త సమస్యలు సృష్టిస్తున్నారు. రోడ్ల కింద పోయిన భూముల వివరాలను ధరణిలో పొందుపర్చాలి.

– అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, కోఆర్డినేటర్, మైస్సార్‌టీపీ

చర్యలు తీసుకుంటాం

భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత రైతులకు పట్టా పాసు పుస్తకాలు వచ్చాయి. రోడ్ల కింద పోయిన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ఎక్కడైన తప్పిపోతే రైతులు మా దృష్టికి తీసుకువస్తే, విచారణ చేసి వివరాలు నమోదు చేస్తాం.

– సుల్తానా బేగం, తహసీల్దారు, హుస్నాబాద్

క్లుప్తంగా

తోడేళ్ల దాడిలో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

చిన్నకోడూరు(సిద్దిపేట): తోడేళ్ల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రామంచ గ్రామానికి చెందిన రైతు ఎడ్ల వెంకట్‌రెడ్డి తన పొలంలో గొర్రెలను పెంచుతున్నాడు. గురువారం అర్ధ రాత్రి గొర్రెల మందపై తోడేళ్లు దాడి చేయడంతో పది గొర్రెలు మృత్యువాతపడ్డాయి. రైతు ఫిర్యాదు మేరకు పశువైద్యాధికారి స్వాతి, గ్రామ సర్పంచ్ హరిపురి సంతోషి, స్థానిక అధికారులు చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. సుమారు రూ.80 వేల విలువగల గొర్రెలు మృతి చెందాయని రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూడాలని అధికారులను వేడుకున్నాడు.

కుక్కల దాడిలో..

సిద్దిపేటరూరల్: కుక్కలు దాడి చేయడంతో మేకపిల్లలు మృతి చెందాయి. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. సర్పంచ్ నరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లూరు గ్రామానికి చెందిన బక్కి కనకయ్య రోజువారీలాగా మేకలను మేపి షెడ్డులోకి తోలి వచ్చాడు. సాయంత్రం వచ్చి చూడగా మేకపిల్లలు మృతి చెందినట్లు గుర్తించాడు. మేకపిల్లల విలువ సుమారు రూ. 40 వేల వరకు ఉంటాయని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

బ్యాంక్ ఖాతా నుంచి రూ.2.78 లక్షలు మాయం

జాతీయ హెల్ప్ లైన్ 1930కు ఫిర్యాదు

హుస్నాబాద్: హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఖాతాదారుడు తన హెడీఎఫ్‌సీ డెబిట్ కార్డ్ స్వైప్ మిషన్‌లో రెండుసార్లు స్వైప్ చేశాడు. ట్రాన్జాక్షన్ ఫెయిల్ అయ్యింది. దీంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కస్టమర్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకుందామనుకున్న లోపే సదరు బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ.2,78,100 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బాధితుడు మోసపోయానని గ్రహించి జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఖాతాలో డబ్బులు ఖాళీ

సిద్దిపేటకమాన్: ట్రైన్ టికెట్స్ క్యాన్సిల్ చేద్దామని ఆన్‌లైన్‌లో ఉన్న నంబర్‌కు కాల్ చేసి ఓ వ్యక్తి డబ్బులు పొగొట్టుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఓ వ్యక్తి ట్రైన్ టికెట్స్ క్యాన్సిల్ చేయడానికి ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయగా అందులో ఉన్న నంబర్‌కు కాల్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి మాట్లాడి ఎనీ డెస్క్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోమని డబ్బులు ఖాతాలోకి పంపిస్తామని నమ్మించాడు. అది నమ్మిన బాధితుడు తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు గుర్తు తెలియని వ్యక్తికి తెలపడంతో తన ఖాతా నుంచి రూ.25 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు సైబర్ మోసం జరిగినట్లు గ్రహించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామనికి చెందిన చాకలి నర్సింలు(65) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. కుటుంబ తగదాలు, ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

జీవాల కరువు యాత్ర

- పశుగ్రాసం కోసం సుదీర్ఘ ప్రయాణం
- జీవాలతోనే సహవాసం
- కష్టాలు ఎదురైనా వాటి కడుపు నింపడమే ప్రాధాన్యం



మేత మేస్తున్న మేకలు

పుల్‌కల్(అందోల్): జీవాల కడుపు నింపడానికి కాపరులు దేశాటన చేస్తున్నారు. గొర్రెలు, మేకలు ఆకలి తీర్చడానికి ఇంటిని, ఊరికి దూరంగా ఉంటూ కరువు యాత్ర చేస్తున్నారు. బతుకు పోరులో ఎన్ని కష్టాలు ఎదురైనా జీవాల కడుపునింపడమే మొదటి ప్రాధాన్యతనిస్తున్నారు. వాన, ఎండ, చలిని లెక్క చేయకుండా గ్రామ శివారులోని పొలాల మధ్యనే జీవాలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. వీరి జీవనం ×కొండపొలం×సినిమా తలపించేల సాగే వీరి జీవనయానంపై సాక్షి ప్రత్యేక కథనం.

- ప్రభుత్వ ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టక ముందు నుంచే వీరు తరతరాలుగా గొర్రెలు, మేకలను సాకుతు జీవనం సాగిస్తున్నారు. ప్రతీ కుటుంబం గొర్రెలు, మేకల పెంపకమే జీవనాధారం. కొందరు గ్రామాల్లో ఇంటి పట్టునే ఉంటూ గొర్రెలను మేపుతుంటారు. కొందరు వేల సంఖ్యలో జీవాలతో జీవనయానం చేస్తున్నారు. ఏడాదంతా ఊరికి దూరంగా ఉంటూ జిల్లాలు దాటి పోతున్నారు. గ్రూపులుగా ఏర్పడి జీవాలను సాకుతున్నారు.
- మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతంలో మైదాన ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో పశుగ్రాసం కొరత లేకపోవడంతో గొర్రెలను మేపడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ఈ రెండు రాష్ట్రాల సరిహద్దులోని తెలంగాణ జిల్లాలైన పాలమూరు, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతంపై ప్రభావం పడింది. ఈ సరిహద్దు జిల్లాల్లోని కొందరు భూమి లేని వారు జీవాలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు.
- జీవాలు వేల సంఖ్యలో ఉండటంతో మేతకు ఇబ్బంది ఏర్పడుతుంది. వీరు గ్రూపులుగా ఏర్పడి పశుగ్రాసం కోసం వేల కిలోమీటర్లు ప్రయాణిస్తారు. ఇంటిని, కుటుంబసభ్యులను వదిలి ఏడాది పొడవున జీవాల మందల వెంటే ఉంటున్నారు. ఒక్కో గ్రూపులో ఐదు వేల నుంచి పది వేల వరకు గొర్రెల మందలుంటాయి. 10 నుంచి 20 మంది గ్రూపులుగా ఉండి జీవాలను మేపుతూ పొట్ట పోసుకుంటారు. వీరి సామాగ్రి, బట్టలు, వంట సామగ్రి మోయడానికి గాడిదలు, గుర్రాలను వినియోగిస్తారు.
- వేసవిలో పంటల నూర్పిడి పూర్తి కావడంతో గొర్రెల మందలు బయలుదేరాయి. వీరు పగలంతా బీడుభూములు, పంటలు, ఒబ్బిడైన భూముల్లో గొర్రెలను మేపుతూ రాత్రి సమయంతో రైతుల కోరిక మేరకు సాగు భూముల్లో మందలు ఉంచుతారు. జీవాల ఎరువుకు రోజుకింత అని రైతులతో ఒప్పందం చేసుకుంటారు. బియ్యం, నూకలు, ఖర్చుల కోసం కొంత నగదు తీసుకుంటారు.
- వర్షం వచ్చినా వీరు జీవాలవద్దనే ఉంటారు. తాత్కాలికంగా గుడారాలు వేసుకుని వాన తగ్గే వరకు అక్కడే ఉంటారు. తగ్గిన తర్వాత మరో చోటికి వెళ్తుంటారు. చలి, వేసవిలో బీడు భూములు, సాగు భూముల ప్రాంతంలో ఉంటారు. వర్షాకాలంలో పట్టణ పరిసర ప్రాంతాలలో ఉంటారు.
- వ్యవసాయ క్షేత్రాలలో మాంసం కోసం ప్రభుత్వ రాయితీలలో ×గోట్ ఫాం, షీప్ ఫాం×లు ఎన్ని ఉన్నా పొలాల్లో గ్రాసం తినే జీవాల మాంసానికే ఎక్కువ డిమాండ్ ఉంటుందని జీవాల కాపరులు అంటున్నారు. మండీల నుంచి వ్యాపారులు స్వయంగా గొర్రెల మందకు వచ్చి జీవాలను ఖరీదు చేస్తారని తెలిపారు. రోజూ కొత్త ప్రదేశాలకు వెళ్తుండటంతో జీవాలకు అనారోగ్య సమస్యలు కూడా తక్కువగానే ఉంటాయి.

ఇంటికి దూరంగా..



మాది ఉమ్మడి కుటుంబం. మా దగ్గర వెయ్యి జీవాలున్నాయి. పది మందితో కలిసి జీవాలను మేపడానికి బయలుదేరాం. పక్షం రోజులకోసారి ఇంటికి వెళ్తాం. మేము ఇంటికి వెళ్లినప్పుడు మా సోదరులు మందకాడికి వస్తారు. కుటుంబసభ్యుల్లో ఎవరో ఒక్కరు మంద వద్ద కాపల కాస్తాం.

– సాదు, గొర్రెల కాపరి, పాలమూరు

ఇళ్లు ఇడిస్తేనే జీవాల పొట్ట నిండుతుంది



జీవాలను సాకడంతోనే మా కుటుంబాలు గడుస్తాయి. అందుకోసం ఇళ్లు, ఊర్లు వదిలి వందల కిలోమీటర్లు ఊరికి దూరంగా జీవాలను తోలుకుపోతాం. సమయానికి తిండి ఉండదు. సరైన నిద్ర ఉండదు. జీవాలతోనే మా జీవితం గడుస్తుంది. పక్షం రోజులకు ఓమారు ఇంటికి వెళ్లివస్తాం.

–మురళి, జీవాల కాపరి, నారాయణపేట

భూసారం పెరుగుతుంది



గొర్రెల ఎరువుతో భూసారం పెరుగుతుంది. సేంద్రియ సాగు వల్ల పంట నాణ్యత పెరుగుతుంది. రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. భూమి సహజత్వాన్ని కోల్పోదు. అంతేకాకుండా పొట్ట చేత పట్టుకొని వచ్చిన జీవాల కాపరులకు ఆర్థిక సాయం చేసినట్లవుతుంది.

– సత్యనారాయణ, రైతు, ముద్దాయిపేట

త్వరలో రజకుల బహిరంగ సభ

జాతీయ రజక సంఘాల కోఆర్డినేటర్ మల్లేశ్ కుమార్



మాట్లాడుతున్న జాతీయ రజక సంఘాల కో–ఆర్డినేటర్ మల్లేశ్ కుమార్

మెదక్‌జోన్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని జాతీయ రజక సంఘాల కోఆర్డినేటర్ మల్లేశ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగు స్వామి ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మలేశ్‌కుమార్ హాజరై మాట్లాడారు. దేశంలోని 17 రాష్ట్రాలతో పాటు మూడు కేంద్ర ప్రాంత పాలితాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారన్నారు. తెలంగాణతోపాటు మరో 11 రాష్ట్రాల్లో రజకులు బీసీలో ఉన్నారని, వారిని వెంటనే ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే నెలలో హైదరాబాద్ వేదికగా రాష్ట్ర స్థాయి రజక భారీ బహిరంగసభ ఏర్పాటు కోసం రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 2 లక్షల మంది రజకులతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ రాష్ట్రం వరకు రజకులు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అత్యంత వెనుకబాటుతనాన్ని, వివక్షతకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికి అనేక ప్రాంతాల్లో రజక మహిళలపై అమానుష ఘటనలు జరిగాయన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సబ్సిడీ రుణాలు నీటిమూటలుగానే మిగిలిపోయాయన్నారు. రజకులను రాజకీయ పార్టీలన్నీ కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని వాపోయారు. రజక రిజర్వేషన్ అమలు విషయంలో హైదరాబాద్ వేదికగా గతంలో అనేక మార్లు సభలు, సమావేశాలు నిర్వహించటం జరిగిందని చెప్పారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, 1984లో కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా నేటి వరకు అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మన రజక సంఘం రాష్ట్ర సెక్రటరీ వెంకట్, రజక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వర్కపల్లి నర్సింహులు, నాయకులుతో పాటు 21 మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడుతుండగా...

గుండెపోటుతో యువకుడి మృతి

హుస్నాబాద్: క్రికెట్ ఆడుతుండగా ఓ యువకుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో చోటుచేసుకుంది. పట్టణంలో కొద్ది రోజులుగా కేఎంఆర్ పేరిట క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. శనివారం గొల్లకుంట వర్సెస్ సుందరగిరి జట్లు తలపడగా, సుందరగిరి జట్టులో బౌలర్ అయిన శనిగరం ఆంజనేయులు(36) 2, 4వ ఓవర్ వేసి ఫీల్డింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన తోటి క్రీడాకారులు హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ఈసీజీ తీస్తుండగానే మృతి చెందాడు.



ఆంజనేయులు (ఫైల్)

బాలికల ఆచూకీ లభ్యం

పటాన్‌చెరు టౌన్: అదృశ్యమైన ఇద్దరు మైనర్ బాలికల ఆచూకీ లభ్యమైంది. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామ శివారులో చేత్త ఏరుకుని జీవనం సాగించే కుటుంబాలు ఉన్నాయి. ఆ కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలు ఈనెల 3వ తేదీన కాగితాలు ఏరుకునేందుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వారి ఆచూకీ తెలియకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. కాగా బాలికల కుటుంబ సభ్యులు తమ పిల్లలను వెతుకుతున్న క్రమంలో గతంలో వీరు నలగండ్లలో గుడిసెలు వేసుకొని ఉన్న ప్రాంతానికి వెళ్లి చూడగా వారు అక్కడ ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు పటాన్ చెరు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ..

సిద్దిపేటఅర్బన్: బంధువు అంత్యక్రియల అనంతరం కాలువలో స్నానం చేసేందుకు దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లుపల్లి గ్రామానికి చెందిన బరేని జ్ఞానికుమార్ (25) ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి బంధువు వృద్ధురాలు మృతి చెందడంతో శుక్రవారం అంత్యక్రియలకు హాజరయ్యాడు. అంత్యక్రియలు ముగిశాక మిట్టపల్లి గ్రామ శివారులోని కాలువలో స్నానం చేసేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునగడంతో అక్కడ ఉన్న వారు బయటకు తీసి సమీపంలోని సురభి మెడికల్ కళాశాల హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి తండ్రి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గంజాయి పట్టివేత

అల్లాదుర్గం(మెదక్): గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ సంఘటన అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఎక్సైజ్ సీఐ నాగేశ్ చెప్పిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు.

10న నిరసన దీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10వ తేదీన సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు ఈ దీక్ష చేపడుతున్నామన్నారు. ఈ నిరసన దీక్షలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

తుపాకులు లేవు.. బెదిరింపులు లేవు

చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

మద్దూరు(హుస్నాబాద్): రెండు రోజులు క్రితం సోషల్ మిడియాలో వైరలైన తుపాకుల కలకలంపై సీపీ శ్వేత ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు చేర్యాల సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మద్దూరు పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ నారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మద్దూరు ఎంపీపీ కృష్ణారెడ్డి, బెక్కల్ ఎంపీటీసీ ఆకుల యాదగిరి తుపాకులు కలిగి ఉన్నారని, వాటితో సెటిల్‌మెంట్‌లు, బెదిరింపులకు పాల్పడుతున్నారని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విచారణ చేపట్టామన్నారు. విచారణలో భాగంగా ఎంపీపీ ఇంటికి వెళ్లి తుపాకీ వివరాలను సేకరించి పరిశీలించగా అది ఎయిర్‌గన్‌గా గుర్తించామన్నారు. అలాగే ఎంపీటీసీ సంబధించిన తుపాకీ అతడి స్నేహితుని వద్ద ఉన్న లైసెన్స్‌గన్‌తో ఫొటో దిగాడని, అతని వద్ద తుపాకీ లేదనిన్నారు. వీరు బెదిరింపులకు పాల్పడలేదన్నారు. తుపాకులతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం

- స్కార్పియోపై ఒరిగిన స్తంభం
- తప్పిన ప్రమాదం



అల్లీపూర్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన స్కార్పియో

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్‌లో ఘోర ప్రమాదం తప్పింది. అదుపు తప్పిన వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో ఓ పక్కకు ఒరిగింది. అయినా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. స్కార్పియో వాహనం అతివేగంగా వచ్చి అల్లీపూర్ ప్రధాన రహదారిలోని స్కూల్ సమీపంలోగల విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. స్తంభం వాహనంపై ఒరిగింది. దీంతో కరెంట్ తీగలు ఒకదానికి మరొకటి తగిలి ఇళ్లలోని బల్బులు, ఫ్యాన్‌లు కాలిపోయాయి. స్కార్పియో డ్రైవర్‌కు స్వల్పగాయాలైయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. యుద్ధ ప్రాతిపధికన విరిగి స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. జహీరాబాద్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరి ఆత్మహత్య



చికిత్స పొందుతూ మృతి చెందిన నాగరాజు

మెదక్ రూరల్: అప్పులబాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన హవేళిఘణాపూర్ మండలం జక్కన్నపేట గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శీల నాగరాజు(33) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 5వ తేదీన గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తితో..



రాజమణి (ఫైల్)

దుబ్బాక: జీవితంపై విరక్తితో ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. దౌల్తాబాద్ ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన తుమ్మల రాజమణి(49) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేది. మృతురాలి భర్త పదేళ్ల క్రితమే మరణించాడు. కుమారుడు మధు హైదరాబాద్‌లో ఉండటంతో ఇంట్లో ఒంటరిగా జీవనం కొనసాగించేది. గురువారం చీటీ డబ్బులు కావాలంటూ మధుకు ఫోన్ చేయగా జీతం రాగానే పంపిస్తానని కొడుకు చెప్పాడు. డబ్బులు విషయంలో కొడుకుతో ఫోన్‌లో గొడవ పడి తీవ్ర మనస్తాపానికి గురైంది. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం కొడుకు మధు తల్లికి ఫోన్ చేయగా సమాధానం ఇవ్వకపోవడంతో ఇంటి పక్కన వారికి సమాచారం ఇచ్చాడు. దీంతో వారు రాజమణి ఇంట్లోకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని కనిపించింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామ నిర్వహించారు.

నీట మునిగి మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

పాపన్నపేట(మెదక్): ప్రమాద వశాత్తు నీట మునిగి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్‌ఐ విజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పొడిచన్‌పల్లి గ్రామానికి చెందిన బైండ్ల లక్ష్మి (57) భర్త కొన్నేళ్ల క్రితం మరణించగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. గురువారం మధ్యాహ్నం కట్టెలు తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి వస్తోంది. గ్రామ శివారులోని మల్ చెరువులో కాళ్లు శుభ్రం చేసుకోవడానికి దిగి ప్రమాద వశాత్తు నీటిలో మునిగి చనిపోయింది. కుటుంబీకులు ఆమె కోసం గాలించిన ఆచూకీ లభించలేదు. శుక్రవారం నీటిలో తేలియాడుతుండటంతో విషయం తెలుసుకొని గ్రామస్థుల సహాయంతో బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా అత్తాకోడళ్ల మధ్య జరిగిన గొడవలో లక్ష్మీ ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు ద్వారా తెలిసింది.

అనుమానాస్పద స్థితిలో..



రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లాపూర్, ఈదులనాగులపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య రైల్వేట్రాక్‌పై ఓ గుర్తు తెలియని మృతదేహం లభించింది. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు నలుపు రంగు గళ్ల ఫుల్ షర్టు,జీన్స్ ప్యాంట్ ధరించాడు. గుర్తుతెలియని రైలు ఢీకొని లేదా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. వికారాబాద్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకస్మాత్తుగా కార్మికుడు..



కార్మికుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామ శివారులోని గార్గ్ స్టీల్ పరిశ్రమలో గురువారం అర్ధరాత్రి జరిగింది. శుక్రవారం చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రంలోని నలంద జిల్లా ప్రసాడి గ్రామానికి చెందిన చున్న ప్రసాద్ గురువారం గార్గ్ స్టీల్ పరిశ్రమలో నైట్ డ్యూటికి వెళ్లాడు. అర్ధరాత్రి స్టీల్ రాడ్ తయారు చేస్తున్న ప్రదేశంలో అకస్మాత్తుగా పడిపోయాడు. దీంతో తోటి కార్మికులు అతడి సోదరులకు సమాచారం ఇచ్చారు. వెంటనే చేగుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ విషయంపై అదే పరిశ్రమలో పనిచేస్తున్న మృతుడి సోదరుడు లాలు ప్రసాద్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో డ్రైవర్..



రవి మృతదేహం

రామాయంపేట (మెదక్): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేటకు చెందిన టంకరి రవి టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామంలో కంకర అన్‌లోడు చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. రవికి భార్య జ్యోతి, ఏడేళ్లలోపు కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తిచేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..

చేర్యాల (సిద్దిపేట): మండలంలోని కడవేర్గు గ్రామానికి చెందిన దివ్యాంగ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు దివ్యాంగుడు కావడంతో ఇంట్లోనే ఉండేవాడు. తాను ఏపని చేయలేకపోతున్నానని బాధపడేవాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. మృతుడి కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.